కథా నిలయం
3571
శ్రీకాకుళం

ఊహల ఉయ్యాల

రిక్షా దిగి ఇంట్లో కెళ్ళబోయిన బ్రహ్మనాయుణ్ణి చూచి కిసుక్కున నవ్వింది తాళం కప్ప, గిజగిజ లాడింది మనసు.

సబ్ ట్రెజరీ ఆఫీసర్‌గా రిటైరై ఈ వయసులో ఆర్టీసీ బస్సులో రెండొందల కిలోమీటర్లు నిరాఘాటంగా ప్రయాణంచేసి, పద్మవ్యూహం ఛేదించినవాడిలా తనను తానభినందించుకున్నాడు కాని తాళం కప్ప కనపడగానే ఉసూరుమంది ప్రాణం. తన గుండెకు వేలాడదీసిన గుదిబండలా కనిపించింది.

రిటైరైన తర్వాత పెన్షన్, గ్రాట్యుటీ, కమ్యుటేషన్ బాపతు సొమ్ము వచ్చిం తర్వాత ఓ సారి ఏడుకొండల వాడిని చూసి రావాలన్న కోర్కె కలిగింది. ఎందుకంటే రిటైర్ కాకముందు తన దగ్గరి కెందరో వచ్చేవారు, బెల్లం చుట్టూ మూగే ఈగల్లా జీతాలు, పెన్షన్, బకాయిలు, రకరకాల బిల్లులు ఎన్‌క్యాష్ కావాలంటే తన సంతకం తప్పనిసరాయె మరి! బల్లకింద నుంచి తైలమందించనంత వరకు తానే బిల్లు మీదా సంతకం చేయడని వారందరికీ తెలుసు.

అప్పుడు మరుగైన పాపభీతి రిటైర్ట్ కాగానే కాళ్ళను చుట్టే

సి కలవరపెట్టాయి. మరునాటి నుంచే తనను చూడగానే వంగి వంగి నమస్కారాలు చేసిన దఫేదారే మూతి తిప్పడం చూసి సగం చచ్చిపోయాడు.

పెన్షన్, గ్రాట్యుటీ, కమ్యుటేషన్ వాల్యూ కొరకు కొన్ని జతల చెప్పులు అరిగేదాకా తిరగాల్సొచ్చింది.

ఎక్కడి కెళ్ళినా "తమకు తెలీందేముంది సార్!" అంటూ సకిలించేవాళ్ళే తాను సంపాదించిన దాంట్లో చాలా వరకు తైలం కింద ఖర్చు పెట్టేప్పుడుగాని తెలిసిరాలేదు. అవినీతి ఎంత భయంకర రూపం దాల్చిందో, సామాన్యుల నెలా పీడిస్తోందో!

అలా డబ్బు రావడమాలస్యం, ఇలా బండెక్కేశాడు-ఓ పది రోజుల్లో తిరుపతి, శ్రీశైలం, మహానందిలాంటి పుణ్యక్షేత్రాలు దర్శించి వద్దామని వచ్చేప్పుడు అత్తవారిల్లయిన సూర్యాపేటలో ఓ రోజు ఉండి మరీ బయలుదేరాడు.

ఏడుకొండలవాడి మూడు నామాలు ఎదలో చెరగని ముద్ర వేశాయి. మనసు అప్పుడెంత ప్రశాంతంగా ఉందో ఇప్పుడంత గాభరా చెందింది.

"బావున్నారా బాబాయ్?"

మెట్లమీద లగేజీతో కూచున్న బ్రహ్మనాయుణ్ణి పలకరించింది పక్కింటి పార్వతి. కూతురితో తాళం చెవి పంపించింది.

'బావున్నానమ్మా" అంటూ తాళం తీశాడు కోడలెక్కడికెళ్ళిందబ్బా? అన్న మనసుకు మనసే సమాధానం చెప్పింది-ఏ పేరంటానికో వెళ్ళుంటుందని.

తలుపులు తెరుచుకున్నాయి. ఇల్లంతా చిందరవందరగా ఉంది. లూటీకి గురైన మక్కచేనులా చూడ్డాని కసహ్యమేసింది ఉండబట్టలేక తాను సర్దగలిగినంత సర్దాడు. ఇంకా కోడలు రాలేదు. కొడుకు కేశవరాం ఆఫీసు నుంచి వచ్చేందు కింకా చాలా టైముంది. ఇల్లు చిమ్మటం ప్రారంభించాడు! రుక్మిణమ్మ నక్కడుంచి రావడం పొరపాటైంది కదూ? కవ్వించింది లోగుట్టు.

అలసట వచ్చేసింది. కాళ్ళూ, చేతులూ కడుక్కొని కాఫీ కాచాడు. తానో కప్పులోకి వంచుకుని మిగతాది ఫ్లాస్కులో పోశాడు.

కాఫీ కప్పు ఖాళీ కాగానే ఆత్మారాముడు శాంతించాడు. కుర్చీలో కూచుని పేపరందుకున్నాడు.

"పోస్ట్!" అన్న కేక వినిపించింది.

గుమ్మంలో కెళ్ళి ఉత్తరా లందుకున్నాడు. అందులో ఒక ఉత్తరం తన పేరున ఉంది. "నాకెవరబ్బా ఇప్పుడు ఉత్తరాలు రాసేది" అనుకుంటూ విప్పాడు.

"పూజనీయులైన మామగారి పాద పద్మములకు నమస్కరించి వ్రాయునది."

"అరె!" ఈఉత్తరం కోడలు రాసింది. తాము వెళ్ళేప్పుడిక్కడే ఉన్న కోడలు ఎప్పుడెళ్ళిందో అంతుపట్టలేదు. కంటిజోడు సవరించగానే కళ్ళు అక్షరాల వెంట పరుగులు తీశాయి - కళ్ళెం లేని గుర్రాల్లా.

మొహం నిండా నీలి నీడలు చోటు చేసుకున్నాయి. భ్రుకుటి ముడిపడింది. మెదడు కాసేపు పని చెయ్యడం మానేసింది.

ఆతర్వాత కోపం, దిగులు ఆక్రమించుకున్నాయి శూన్య ప్రదేశాన్ని గాలి ఆక్రమించుకున్నట్టు.

కాసేపు పచార్లు చేశాడు. కాసేపు కూచున్నాడు.

భాగవతంలో కృష్ణ లీలలు చదువుకుంటూంటే "తాతయ్యా!" అంటూ చుట్టేశాడు వెనక నుంచి గునగున వచ్చిన మనవడు ధ్రువుడు.

ఎత్తుకుని ముద్దాడి ఒళ్ళో కూచోబెట్టుకున్నాడు. ధ్రువుడు కేరింతలు కొడుతూ తన మీసాలు పీకే ప్రయత్నం చేస్తున్నాడు "ఒరేయ్ భడవా" అంటూ వారించబోయాడు.

వాడు ఏడుపు బ్రహ్మాస్త్రం ప్రయోగించాడు. నివారణోపాయం ఫెయిలైంది. మీసాలు లాగి దిగి, చప్పట్లు కొడుతూ తుర్రుమన్నాడు. అందుకోవాలని వెంబడించాడు బ్రహ్మనాయుడు. మనవడు వేగంగా పరుగెత్తబోయి పడిపోయాడు. 'తాతయ్యా!' అంటూ చేతులందించాడు "నీవే తప్ప ఇహ పరంబెరుగ" అన్నట్టుగా "ధ్రువా!" అంటూ లేవనెత్తబోయాడు.

"ఎప్పుడొచ్చావ్ నాన్నా?"

కొడుకు కేశవరాం పలుకరించగానే అనుభూతి కరిగింది.

"అప్పుడే వచ్చానా్ర" మాట నూతిలోంచి వచ్చింది.

ఏంటి నాన్నా అలాగున్నావప్పుడే? అంటూ బాత్రూంలో దూరబడ్డాడు జవాబు కోసం చూడకుండా.

అరికాలి మంట నెత్తికెక్కింది, శివతాండవం చెయ్యాలనిపించింది వెంటనే శాంతమే పరమభూషణమన్న మాట గుర్తు

కొచ్చింది.

'ఏంటి మావయ్యా! అలాగున్నారు? బాగా అలిసిపోయుంటారు. మీ కొడుకు ఉద్యోగం చేస్తున్నాడు కదా! మీరిక వాలెంటరీ రిటైర్మెంటు పుచ్చుకోరాదూ?' ఆఫీసు నుంచి రాగానే ఆప్యాయంగా పలుకరించింది శిల్ప. ఆ పలకరింపుతోనే వెయ్యి ఏనుగుల బలం వచ్చింది.

'ఎందుకమ్మా! ఇంకొక్క సంవత్సరం వరకే గదా! ఎలాగోలా లాగించేస్తారు కదండీ!' అంది రుక్మిణమ్మ కాఫీ అందిస్తూ.

'మీ అత్తగారి అభిప్రాయమే నా అభిప్రాయం. పైగా-మరో మూడు నెలల్లోగా నాకో మనవణ్ణి దివ్వబోతున్నావు గదా! వాడు కాస్త పెరగ్గానే మామూలుగా రిటైరవుతాను. వెంటనే వాడితో ఆడుకునే ఉద్యోగంలో జాయినవుతాను' అన్నాడు కాఫీ కప్పు ఖాళీ చేస్తూ.

'పోండి మావయ్యా!' సిగ్గుల మొగ్గలు రాల్చి ఖాళీ కప్పు తీసు కెళ్ళింది కోడలు.

మనసారా నవ్వుకోవడం వృద్ధ దంపతుల వంతైంది.

'ఏంటి నాన్నా? ఏదో పోగొట్టుకున్న వాడిలా అలా కూచున్నావ్?' మొహం కడుక్కొచ్చిన కేశవరాం మొహం చిట్లించాడు, తువ్వాలుతో తుడుచుకుంటూ.

కొత్త దువ్వుకుంటున్న కొడుకు మొహం చూద్దామనుకుంటే కుదుర లేదు.

'అమ్మా కాఫీ ఇవ్వవే!' వంటిట్లో చొరబడ్డాడు కేశవరాం.

అమ్మ లేదు. పక్కింటి కెళ్ళుండొచ్చనుకున్నాడు. ప్చ్!

పిచ్చి అమ్మ. ఏదన్నా ఊరెళ్ళి వచ్చినా, సినిమా కెళ్ళి వచ్చినా వీధిలోని ఆడవాళ్ళందరికీ విశేషాలు చెబుతుంది పూసగుచ్చినట్టు అందాకా ఆమెకు నిద్రపట్టదు. అనుకుంటూ కాఫీ కప్పులోకి వంచు కున్నాడు.

'చూశావా! నీ కోసం కాఫీ కాచి ఉంచింది, అలిసిపోయి వస్తావని. అమ్మ మనసు వెన్నపూస, అందుకే అంటారు కాబోలు 'అమ్మ ఆకలెరుగుతుంది. అర్ధాంగి అర్థమెరుగుతుం'దని అంది మనసు.

కాఫీ కప్పు ఖాళీ చేస్తూ, పెళ్ళాం బెల్లం- అమ్మ అల్లం అనే ఆలోచననే తనకు రానందుకు కనుబొమ లెగరేసి ఛాతీ విరుచుకు న్నాడు. ఈల వేయబోయి నాలిక్కరుచుకున్నాడు.

'అమ్మ ఎవరింటి కెళ్ళింది నాన్నా?' అడిగాడు

పది రోజులు దాటింది అమ్మను చూసి, త్వరగా చూడాలనే ఉబలాటం గరిష్ఠస్థాయికి చేరుకుంది.

'అబ్బా! మాట్లాడవేం నాన్నా?' ఎదురుగా కుర్చీలో కూల బడ్డాడు చెట్టుమీంచి పండురాలినట్టు.

మొహం పక్కకు తిప్పుకున్న బ్రహ్మనాయుడి మౌనవ్రతం చిరాకెత్తించింది కేశవరాంను.

'అబ్బబ్బా! చెప్పవేం నాన్నా?' అసహనం.

మొహం తిప్పి కేశవరాం కళ్ళలోకి సూటిగా చూశాడు తండ్రి.

'అప్పట్నుంచి గమనిస్తున్నాను, మీ అమ్మ ఏదనే అడుగు తున్నావ్ గాని, నా కోడలేదో చెప్పవేం? నా మనవడి నెక్కడికి పంపించావో చెప్పి ఏడవ్వేం?' అనేసాడు రుసరుసలాడుతూ.

పులిలా లేద్దామనుకున్న కేశవరాం పిల్లైపోయాడు.

'ఓహ్! అదా మీ కోపం? శిల్ప పుట్టింటి కెళ్ళింది. బాబు వాళ్ళమ్మమ్మ ఇంటి కెళ్ళాడు. నేనూ మాఅత్త వారింటి కెళ్ళొచ్చాను' కాసింతైనా తండ్రిని రంజింప జేయాలనుకున్నాడు.

'అందరూ కలిసే వెళ్ళారా?' జోకు పేలలేదు.

'ఔనా నాన్నా!' వినయం.

'ఐతే వాళ్ళనక్కడే వదిలేసి నువ్వెందుకొచ్చావిక్కడికి? మొహమ్మీద గుద్దినట్టడిగాడు.

'అదేంటి నాన్నా? అక్కడి కెళ్ళగానే శిల్పకు నాలుగురోజులుండాలనిపించిందక్కడ, సరేనని ఉండి రమ్మన్నాను' నీళ్ళు నమిలాడు.

'ఉండి వస్తానందా! ఉండిపొమ్మన్నావా?' ముసలాయన తిరకాసుకు తట్టుకోలేకపోయాడు.

'ఇంతకీ అమ్మ!' ప్లేటు ఫిరాయించబోయాడు.

'మీ అమ్మను వాళ్ళ పుట్టింట్లో వదిలేసి వచ్చాను. వస్తూ నేను మీ అమ్మమ్మ ఇంటికీ, మాఅత్త వారింటికీ వెళ్ళి మరీ వచ్చాను' తడుముకోకుండా చెప్పేశాడు.

'ఐతే వచ్చేప్పుడు సూర్యాపేట కెళ్ళారా?' విస్మయం.

'ఔను. అందుకే పది రోజులనుకుంటే ప్రయాణం పన్నెండు రోజులు దాటింది.'

నాన్న మీద కోపమొచ్చింది కేశవరాంకు.

'ఫ్లాస్కులో కాఫీ నేను పోసిందే' తిరిగి తానే అంటూ కొడుకు వదనారవిందం మీద దోబూచులాడుతున్న రంగుల్ని పరిశీ

లించసాగాడు.

'అలాగా? కానీ.... అమ్మ నెందుకు ...'

'పుట్టింట్లో ఉంచి వచ్చానంటావు?'

ఔనని తలూపాడు కేశవరాం.

'కొన్ని నెలలక్కడే ఉంటానని సరదాపడింది. ఇక మళ్ళీ రానక్కరలేదని చెప్పి వచ్చేశాను.' మొహం మళ్ళీ పక్కకు తిరిగింది.

'ఏం? ఎందుకు?' చిరుర్రిమంది కోపం.

'ఔను. మా పెళ్ళిలో మీ అమ్మమ్మ మా మామగారలు నాకో సైకిల్ మోటారు కొనిస్తామన్నారు. ఇంకా కొనిపెట్ట లేదింతవరకు. కొనిచ్చేదాకా మీ అమ్మ అక్కడే ఉంటుందని మీ అమ్మమ్మతో చెప్పి ఎంచక్కా వచ్చేశాను' చెప్పుకుపోయాడు.

అయోమయంలో కొట్టుకుపోతున్నాడు కేశవరాం.

'ఒకవేళ, కొనివ్వకపోతే?'

"అమ్మ అటు, నే నిటూ" ముసలాయన తీర్పుకు గుండె గుభేలుమంది.

కోపం. ఏడుపు కలగలిసిపోయాయి. ఏమీ చేయలేనితనం వెక్కిరించింది.

'ఛీ,ఛీ! ఇదేమిటి నాన్నా? ఇంత వయసులో.... మీరు....' అసహ్యమేసినా ధైర్యం చాల్లేదు.

'మరి ఈ వయసులో నువ్విదేమిట్రా?' కోడలి ఉత్తరం కొడుకు చేతిలో రాలింది.

కేశవరాం చేతులు తమ పని తాము కానిచ్చాయి.

'పూజనీయులైన మామగారి పాద పద్మములకు నమస్క రించి వ్రాయునది.

'మీరీ పాటికి తిరుపతి నుంచి తిరిగి వచ్చారనే, సాహసించి ఉత్తరం రాస్తున్నాను. మీరు తిరుపతి వెళ్ళిన మర్నాడే మీ కొడుక్కు మా పెళ్ళిలో మా నాన్నగారిస్తానన్న స్కూటర్, టీవీల మీదికి మనసు మళ్ళింది. సరదాగా మా పుట్టింటికెళ్ళి వద్దామని నన్నిక్కడికి తీసుకువచ్చారు.

'స్కూటర్, టీవీలు తీసుకుని మాత్రమే తిరిగి రా! లేక పోతే లేదని నన్నూ బాబునూ బలవంతంగా ఇక్కడుంచి వెళ్ళారు.

'మా పెళ్ళైన నెల రోజుల్లోనే మా నాన్న చనిపోయిన సంగతి కూడా తెలుసు! మా తమ్ముడికింకా ఉద్యోగం దొరకలేదు. అమ్మకు వచ్చే పెన్షన్‌కు తోడు అప్పులు చేస్తేనే ఇల్లు గడుస్తుంది. మా అమ్మకు ఫామిలీ పెన్షన్ శాంక్షనయ్యే వరకు చాలా ఖర్చైంది. వచ్చిన గ్రాట్యుటీ అప్పుల తుప్పలకు చెల్లింది.

'అంతకు ముందు కూడా అప్పుడప్పుడడిగేవారు మా వాళ్ళ ముక్కు పిండి వసూలు చేసుకురమ్మని. వాళ్ళ పరిస్థితి వివరిస్తూ ఈ విషయం మీ దృష్టికి తెస్తానని చెబుతూ వారించగలిగాను.

'మా తమ్ముడికుద్యోగం దొరికిన తర్వాత ఇస్తామంది మా అమ్మ. కాని మీ అబ్బాయి అనరాని మాటలని వెళ్ళిపోయాడు.

'మమ్మల్ని విడిచి కాలగర్భంలో కలిసిపోయిన మా నాన్నను మీలో చూచుకుంటున్నాను. అత్తగారి ఆదరాభిమానాలకు నా మీద నాకే ఈర్ష్య కలిగింది. కాని ఇలా జరిగిపోయింది.

తాతయ్య కావాలంటున్నాడు మీ మనవడు.

మీ నిర్ణయాని కొరకు చూస్తూ....

మీ కోడలు

'శిల్ప'

ఉత్తరం కంపరమెత్తించింది తేలుకుట్టిన దొంగలా అయిపోయాడు కేశవరాం.

మర్నాడు ఆఫీసుకు తయారవుతూ 'అమ్మను చూడకుండా ఇన్ని రోజులెప్పుడూ ఉండలేదు నాన్నా!' అన్నాడు.

శిల్పను, బాబును అక్కడ ఉంచేసినందుకు బాధగానే ఉన్నా, టీవీ, స్కూటర్ కళ్ళలో మెదిలేసరికి మనసు రాయైపోతూంది. వాటిని సాధించి తీరాలనిపిస్తుంది. అమ్మను చూడాలనే తహతహ హద్దులు దాటింది.

'నేను కూడా నా మనవణ్ణి చూడకుండా ఇన్నిరోజు లెప్పుడూ లేన్రా!' తండ్రి ఎదురు బాధ బాగనిపించలేదు.

'కాని నాన్నా మనం కాస్త ఓపిక పడితే, బెట్టుగా ఉంటే ఎలాగోలా శిల్ప వాళ్ళమ్మను సాధించి టీవీ, స్కూటర్ కొనిపిస్తుంది. ఆ తర్వాత ఎంత బావుంటుందో! ఊహాలోకంలోకి లాక్కెళ్ళాననుకున్నాడు తండ్రిని.

'ఔన్రా! మనం ఓపిక పడితే లాభాలే లాభాలు. మీ అమ్మ కూడా మీ అమ్మమ్మ ఘుటక్కి చప్పిడి చేసి సైకిల్ మోటారు కొనిపిస్తుంది. నువ్వు స్కూటర్ మీద, నేను సైకిల్ మోటారు మీద ఝామ్మని తిరగొచ్చు! ఊహల ఉయ్యాల ఎక్కించేశాడు నేనేం తక్కువ తిన్నానా? అన్నట్టు.

'అమ్మ చేతి వంట తినాలనుంది నాన్నా!'

'మనవడి చేత మీసాలు పీకించు కోవాలనుందిరా!'

మొండి ఘటం, ముసలాయన్ను గెలవడం కష్టమైపో యింది.

నాల్రోజులైంది.

వంట పని ఇద్దరం కలిసీ చేసుకుంటా మనుకున్నా కేశవ రాం ఆలోచన తలకిందులైంది. ప్రతి చిన్న పనికీ ఆయాసం వస్తోంది బ్రహ్మనాయుడికి, పూర్తి రెస్టు తీసుకుంటున్నాడు.

ఆరోజు శుభోదయ సమయంలో అనుమానం వచ్చింది కేశవరాంకు 'నాన్న నన్నేదో బోల్తా కొట్టిస్తున్నాడని.

'కావాలనే దొంగాటక మాడుతున్నాడేమో? మొదట తానె న్నిసార్లు స్కూటర్, టీవీల ఊసెత్తినా ఇస్తే తీసుకో, లేక పోతే మానుకో అనేవాడు. ఆ తర్వాత ప్లేటు మార్చి వాళ్ళు ఇబ్బందుల్లో ఉన్నారు. వాళ్ళేమీ మన కివ్వక్కర్లా, శిల్పని కూడా అడగొద్దని చెప్పు అన్నేశాడు. ఈయన వ్యవహారం చూస్తుంటే అవి వసూల య్యేట్టు లేవనుకని సమయం, సందర్భం రాగానే ఒక నిర్ణయం తీసుకుంటే ఇలాగైంది. ఇప్పుడేం చెయ్యడం?_అంతర్మథనం.

మెరుపులాంటి ఆలోచన వచ్చింది. ఎత్తుకు పై ఎత్తు తోచింది.

'నాన్నా! నే నీ రోజు కేంపు కెళ్తున్నా, రేపు వస్తా' అని సూటుకేసు సర్దుకుని సాయంత్రానికల్లా సూర్యాపేట కెళ్ళాలని, సంగతేమిటో అక్కడే కనుక్కోవచ్చు- నాన్న చెప్పే దాంట్లో నిజమెంతో అమ్మ నుంచి లాగొచ్చు. ఇక్కడ నాన్న బెదిరింపులు అమ్మకు తెలీవు కాబట్టి ప్రాబ్లం లేదు. ఎంచక్కా అమ్మను తీసుకు రావచ్చు, తన ఐడియాకు తనే మురిసిపోతూ చకచకా పని చేసు

కుపోతున్నాడు ఎక్స్‌ప్రెస్ ట్రైన్‌లా.

'మీకు ఉత్తరం సార్!' ఉత్తర మందించాడు అటెండర్. విప్పాడు.

'చిరంజీవి కేశరాంను, మీ అమ్మ దీవించి వ్రాయునది.

మీ నాన్న, నేనూ తిరుపతి నుంచి రాగానే అప్పుడెప్పుడో మా పెళ్ళిలో మానాన్న మీనాన్న కిస్తానన్న సైకిల్ మోటారింకా ఇవ్వలేదని గుర్తుకొచ్చింది. కాసేపు ఇద్దరం దెబ్బలాడుకున్నాం రైల్లోనే! రిటైరైన తర్వాత ఇహ కాలి నడకన తిరగాలంటే ఓపిక లేదు. ఇప్పుడది తప్పకుండా కావాలన్నాడు. ఆ సంగతి మరిచి పోమన్నా వినకుండా నన్ను బలవంతంగా అమ్మమ్మ వాళ్ళ ఇంట్లో వదిలేశాడు. సైకిల్ మోటారు తీసుకొనే తిరిగి రమ్మన్నాడు

మీపెళ్ళై పట్టుమని నాలుగు సంవత్సరాలైనా, కాకున్నా, మీ మామ గారిస్తానని ఒప్పుకున్న టీవీ, స్కూటర్ సంగతి నువ్వు గుర్తు చేస్తున్నావా? మీ మామగారు పోయారని గమ్మున ఊరు కున్నావు, వాటి మీద ఆశ వదులుకుని, నిన్ను చూసైనా మీనాన్న బుద్ధి తెచ్చుకోవాల్సిన అవసరముంది కదూ?

నా మనసంతా మనవడి మీదే ఉంది. కోడల్ని వెంటనే చూడాలని, నా చేతుల మీదుగా నీకు వంట చేసిపెట్టాలని ఆశగా ఎదురు చుస్తున్నారా! ఎలాగైనా మీ నాన్నగారి నొప్పించి పంపించు, నువ్వు వస్తే మాత్రం నేను రాను. మీ నాన్న కోస మెదురు చూస్తూ....

మీ అమ్మ

రుక్మిణమ్మ

పీక్కున్నాడు. ఫైళ్ళు చించేద్దామన్నంత తిక్క రేగింది కాని, అలా చేస్తే ఉన్నది పోతుంది, ఉంచుకున్నది మూతిపళ్ళూడగొట్టి పోతుందనే సామెత గుర్తుకొచ్చింది. మొహం కందగడ్డయిపోయింది.

అమ్మను నిజంగానే సాధిస్తున్న, నాన్న, మీద నిర్దాక్షిణ్యంగా విడుచుకు పడాలని ముందే బయలుదేరాడింటికి. కాని మార్గమధ్యంలో బస్‌స్టాండ్ ముందుకొచ్చేసరికి అక్కడే అగిపోయాడు.

నాన్నతో ఎంతసేపు పితలాటక మాడినా కుదరదు. మహా మొండి ఘటం. అమ్మను తీసుకురమ్మంటే వినడు. ఆలోచించి బస్సెక్కేశాడు.

రాత్రికల్లా అత్తవారింటికి చేరుకున్నాడు. ఉదయమే శిల్పనూ, బాబునూ వెంటబెట్టుకు బయలుదేరాడు. '....మా వాడికి ఉద్యోగం దొరగ్గానే కొనిస్తాం బాబూ!' తనను స్వాగతిస్తున్నప్పుడు అత్తగారి కనసన్నల్లో నీళ్ళు తిరగాయి.

పడగ్గదిలో 'మనం కొనుక్కొని వాడుకోవాలిగానీ ఒకరు కొనిచ్చినవి వాడుకుంటే గొప్పతనమటండీ? నన్నూ, బాబునూ విడిచి మీరెలా ఉండగలిగారు?' వెక్కి వెక్కి ఏడ్చిన శిల్ప.

'తాతయ్య పోదాం నాన్నా!' కాళ్ళను చుట్టేసిన బాబు మారాము.

గుర్తుకొచ్చి కడుపులో ఎవరో చేయిపెట్టి దేవినట్లనిపించింది.

'నిజంగా నే నెలా ఉండగలగాను?' ప్రశ్నించుకున్నాడు. ఉదయం బయలుదేరే ముందు తాను 'నాకు టీవీ, స్కూటర్ కొని

వ్వాల్సిన అవసరం లేదని అత్తగారితో చెప్పడం మంచిదైం దనుకున్నాడు

'మనూరొచ్చింది దిగండీ!' ఒక చేత్తో బాబు నెత్తుకుని మరో చేత్తో బ్యాగు అందుకుంటూ అంది శిల్ప.

పరధ్యానం పరుగెత్తింది. తుళ్ళిపడి సూట్‌కేసందుకున్నాడు. బస్సు దిగారు.

కోడల్నీ, కొడుకునూ చూడగానే ప్రాణం లేచి వచ్చింది బ్రహ్మనాయుడికి.

'తాతయ్యా!' అంటూ చేతు లందించిన బాబు నెత్తుకుని గుండెలకు హత్తుకున్నాడు. కళ్ళలో ఆనందబాష్పాలు కదలాడినాయి. బుగ్గల్ని ముద్దులతో నింపేశాడు.

భోజనాలయ్యేదాకా తండ్రీ కొడుకుల మధ్య మాటలు కరువైనాయి. కేశవరాం ఆఫీసు కెళ్ళబోతుంటే బ్రహ్మనాయుడు భుజమ్మీద కండువా వేసుకుని, చేతిలో సంచీ పట్టుకుని బయలుదేరాడు.

'ఎక్కడికి కెళ్తున్నారు మావయ్యా!' అంది శిల్ప.

'మీ అత్తయ్యను తీసుకొస్తానమ్మా!' బయటపడ్డ బ్రహ్మనాయుడి కుడి చేయి మీసాలు తిప్పింది అనుకోకుండా.

తనలో తానే నవ్వుకుంది శిల్ప.

రాత్రికల్లా రుక్మిణమ్మ దిగింది.

వచ్చేప్పుడు బస్సులో '. జంగా కేశవరాముడంత పని చేశాడాండీ?' అంది ఇంకా నమ్మబుద్ధిగాని రుక్మిణమ్మ.

'ఔను తేరగా వచ్చేది ఎందుకు వదలాలనేదీ ఆలోచించాడు

కాని, పాపం! మన వియ్యపురాలి అవస్థ వాడి కర్థం కాలేదు. విషయం తెలియరాగానే వివరంగా నీకుత్తరం రాశాను. నేను రాయమన్నట్టుగా వివరంగా నువ్వు వాడికుత్తరం రాసినట్టున్నావు.

'ఔను! మీరు రాసిన మర్నాడే నా కందింది మీ ఉత్తరం. వెంటనే ఏ మాత్రం ఆలస్యం చేయకుండా మీరు రాయమన్నట్టుగా వాడి ఆఫీసు అడ్రసుకు రాసి పడేశాను ఉత్తరం.'

'అందింది కాబోలు - రోగం టక్కున కుదిరింది' మీసాల మీదికిపోతున్న చెయ్యి నాపింది.

'ఎలా?' అంటూ బుగ్గలు నొక్కుకుంది.

'కాంపు కెళ్తున్నానని బయలుదేరి శిల్పనూ, మనవణ్ణీ తీసుకొనొచ్చాడు' టకీమని మీసం మెలేశాడు గర్వంగా, ముక్కుమీద వేలేసుకుంది రుక్మిణమ్మ.

'మనం ఏడుకొండల కెళ్ళడమేమిటి! పుట్టింట్లో నాల్రోజులుండమని మీరు నన్నుంచిపోవడ మేమిటి?' ఇంకేదో అనబోయింది.

భార్య కళ్లలోకి చూస్తూ 'వాడికి బుద్ధి రావడమేవిటి?' అన్నాడు బ్రహ్మనాయుడు మూతి తిప్పుతూ.

'ఇదంతా మన మంచికే' అంది నిమ్మకాయలనైనా నిలబెట్టగలిగిని మీసాల్ని తనివిదీరా చూస్తూ.

గొల్లున నవ్వేశాడు బ్రహ్మనాయుడు. రుక్మిణమ్మ శృతి కలిపింది. ఇంటికొచ్చేసరికి మెట్లమీదనే కనిపించాడు కేశవరాం.

'మీ అత్తగారు కొనిచ్చిన సైకిల్ మోటారేది నాన్నా?' గడపలో అడుగు పెడుతూంటే అడిదాడు అమ్మా నాన్నల్ని చూసి

ఓ పక్క ఆనందిస్తూనే, మరో పక్క ఉటకంచా లుడుకుంటూ

'నీ అత్తగారిచ్చిన ప్యాక్టర్‌కు కట్టేశా[నా!' అన్నాడు చెప్పులు విడుస్తూ.

తృప్తిగా నవ్వారంతా.

తప్పు చేసిన వాడిలా సిగ్గుపడిపోయాడు కేశవరాం.